సాక్షి
ఖమ్మం
మంగళవారం। 20। జూన్। 2023





**దరఖాస్తు చేసుకుంటామా..**

కుల, చేతివృత్తిదారులకు కుల, ఆదాయ సర్టిఫికెట్లు అందకపోవడంతో ఆర్థిక సాయం దరఖాస్తుల్లో ఆలస్యం జరుగుతోంది. 8లో



**తొలగించిన ఆర్టిజన్లకు పోస్టింగ్**

ఇటీవల సమ్మె చేయగా, విద్యుత్ సంస్థల నుంచి తొలగించిన ఆర్టిజన్లను మళ్లీ తీసుకుని దూరప్రాంతాల్లో పోస్టింగ్ ఇచ్చారు. 8లో




**వాతావరణం**

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయిలో నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత వడగాలుల ప్రభావం ఉంటుంది.

## న్యూస్‌రీల్

### 'తెలంగాణ ప్రగతి' పుస్తకం అందుకున్న సండ్ర



సీఎం, సీఎస్ నుంచి పుస్తకం అందుకుంటున్న ఎమ్మెల్యే

సత్తుపల్లి: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకల సందర్భంగా రాష్ట్ర ప్రగతిని వివరిస్తూ ప్రత్యేక పుస్తకాన్ని రూపొందించారు. ఈమేరకు పుస్తకాన్ని హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్, సీఎస్ శాంతకుమారి ఆవిష్కరించగా, వారి చేతుల మీదుగా సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అందుకున్నారు. తెలంగాణ ఏర్పడ్డాక జరిగిన అభివృద్ధి, అమలుచేసిన పథకాలను వివరిస్తూ ఈ పుస్తకాన్ని రూపొందించారు. కాగా, సీతారామ ప్రాజెక్టులో భాగంగా సత్తుపల్లి మండలం బుగ్గపాడు, యాతాలకుంట, రేగళ్లపాడు, రుద్రాక్షపల్లి నిర్వాసితులకు పరిహారం మంజూరు, బేతుపల్లి చెరువు పంట కాల్వల ఆధునికీకరణ, సత్తుపల్లి, వేంసూరు మండలాలకు నీరు అందించే ఎన్టీఆర్ కెనాల్ అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని సీఎంను ఎమ్మెల్యే ఈ సందర్భంగా కోరారు.

### ప్రజా సేవలోనే ఎనలేని తృప్తి..

ఎంపీ నామ నాగేశ్వరరావు



ఖమ్మంమయూరిసెంటర్: రాజకీయ జీవితంలో ఎంపీగా, బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేతగా నాలుగేళ్ల పదవీకాలంలో ప్రజల కోసం పని చేయడం ద్వారా ఎనలేని తృప్తి, దైవానుభూతిని పొందానని ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎంపీగా పదవి చేపట్టి సోమవారం నాటికి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన ఓ ప్రకటనలోవిడుదల చేశారు. పార్టీ అధినేత, సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సహకారంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల ఆశీర్వాదంతో ఎంపీగా గెలిచి పార్లమెంట్ సాక్షిగా అనేక సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశానని తెలిపారు. విభజన సమస్యలు, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పెండింగ్ ప్రాజెక్టుల సాధనకు క్రియాశీలకంగా పోరాడినట్లు తెలిపారు. బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, నూతన రైల్వే లైన్లు, సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడానని, సీఎం కేసీఆర్ అప్పగించిన బాధ్యతలను మిగతా సభ్యుల సహకారంతో నిర్వర్తిస్తున్నానని వెల్లడించారు.


### ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలుకు కృషి



అవినాష్‌కుమార్

మధిర: ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలుకు కృషి చేస్తానని ట్రెయినీ ఐపీఎస్ అధికారి అవినాష్‌కుమార్ తెలిపారు. శిక్షణలో భాగంగా సోమవారం ఆయన మధిర పట్టణ పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్(ఎస్‌హెచ్‌ఓ)గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడడంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో పోలీసు ఉద్యోగుల సహకారంతో మెరుగైన సేవలు అందిస్తామని పేర్కొన్నారు. కాగా, రూర్కెలా ఐఐటీలో ఇంజనీరింగ్ పూర్తిచేసిన ఆయన 2016లో ఐఎఫ్ఎస్‌గా ఎంపికై నా ఐపీఎస్‌పై మక్కువతో 2021 బ్యాచ్‌కు ఎంపికయ్యారు. మూడు నెలల పాటు మధిర టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓగా ఆయన విధులు నిర్వర్తించనున్నారు. ఈ సమావేశంలో మధిర సీఐ ఒడ్డేపల్లి మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

### రేపటి నుంచి ఈవీఎంల పరిశీలన



సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: త్వరలో ఎన్నికలు జరిగే అవకాశముందన్న ప్రచారం నేపథ్యాన జిల్లా అధికార యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లలో నిమగ్నమైంది. జెడ్పీ ఆవరణలో స్ట్రాంగ్ రూమ్ ఉండగా, సమావేశ మందిరంలో ఈనెల 21నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు ఈవీఎంల పరిశీలన చేపట్టనున్నారు. ఇందుకోసం అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్ సోమవారం జెడ్పీ సమావేశ మందిరం, స్ట్రాంగ్ రూమ్ ఆవరణను పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి సమావేశ మందిరం వరకు బారికేడ్లు ఏర్పాటుచేయాలని తెలిపారు. ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బోర్డుపై బోధిస్తున్న ఉపాధ్యాయుడు



# ట్యాబ్‌లు.. డిజిటల్ బోర్డులు

**నేడు ప్రారంభం**

ఈ నెల 2వ తేదీన మొదలైన తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలకు కేటాయించిన ట్యాబ్‌లు, డిజిటల్ టీవీలను ప్రారంభిస్తారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతికత**

- సుమారు రూ.13కోట్ల వ్యయంతో ఏర్పాటు
- దృశ్య సహిత బోధనతో విద్యార్థులకు ఉపయోగం



ఆధునికీకరించిన దానవాయిగూడెం పాఠశాలలో పాఠం వింటున్న విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఫలితంగా గతంలో విద్యాసంవత్సరం మొదలై నెలలు గడిచినా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందకపోయేది. కానీ ఈసారి పాఠశాలల పునఃప్రారంభం రోజే అందజేశారు. అంతేకాక పాఠశాలల్లో డిజిటల్ బోధన మొదలుపెట్టారు. ప్రతీ ప్రభుత్వ పాఠశాలకు ఒక ట్యాబ్, ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10వ తరగతుల బోధనకు డిజిటల్ టీవీ సమకూర్చింది. దీంతో దృశ్య సహిత బోధనకు అవకాశం కలగగా, అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు.



**హైస్కూళ్లకు డిజిటల్ బోర్డులు**

8, 9, 10వ తరగతి విద్యార్థులకు పాఠశాలలకు డిజిటల్ టీవీలు సమకూర్చారు. ఒక్కో పాఠశాలకు మూడేసి చొప్పున ఇస్తున్నారు. వీటి విలువ రూ.10.50లక్షలు ఉంటుందని అంచనా. పైన వైట్ బోర్డు, గ్రీన్‌బోర్డు మాదిరి రాసుకునే వెసలుబాటు ఉండగా.. టీవీ ద్వారా ఆన్‌లైన్ బోధన కూడా చేయొచ్చు. వీటిని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్(డిజిటల్ టీవీ)లుగా కూడా పిలుస్తారు. ఉన్నతాధికారులెవరైనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలన్నా ఇవి ఉపయోగపడుతాయి.

**సౌకర్యాలతో కళకళ**

ప్రభుత్వ పాఠశాలంటేనే గతంలో అందరికీ చిన్నచూపు ఉండేది. కనీస సౌకర్యాల లేకపోగా, కనీసం కూర్చునేందుకు బెంచీల సౌకర్యం ఉండకపోయేది. కానీ మన ఊరు – మన బడి, మన బస్తీ – మన బడి ద్వారా జిల్లాలో తొలి విడతగా 426 పాఠశాలలను ఎంపిక చేయగా పనులు పూర్తయ్యాయి. ఈమేరకు 28 పాఠశాలలను విద్యాదినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రారంభించనున్నారు.

**నేటి కార్యక్రమాలిలా..**

జిల్లాలోని ప్రభుత్వ, అనుబంధ పాఠశాలల్లో విద్యాదినోత్సవం సందర్భంగా మంగళవారం ర్యాలీలు నిర్వహిస్తారు. మన ఊరు – మన బడి, మన బస్తీ – మన బడి కింద అభివృద్ధి చేసిన పాఠశాలలను ప్రారంభించడమే కాక సాయంత్రం 5గంటలకు నగరంలోని డీపీఆర్‌సీ భవనంలో విద్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా పదో తరగతిలో 10జీపీఏ సాధించిన విద్యార్థులు, 100శాతం ఫలితాలు సాధించిన పాఠశాలల హెచ్‌ఎంలను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ గౌతమ్ తదితరులు సన్మానిస్తారు. అలాగే, జూనియర్ కళాశాలల్లో జాతీయ పతాకావిష్కరణ చేయడమే కాక విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు డీఐఈఓ రవిబాబు తెలిపారు. ఇంటర్మీడియట్‌లో రాష్ట్రస్థాయి మార్కులు ఎంసెట్ తదితర పోటీ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తామని వెల్లడించారు.

**కార్పొరేట్‌కు దీటుగా...**

కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించి ఒక్కటొక్కటిగా అమలు చేస్తోంది. మన ఊరు – మన బడి, మన బస్తీ – మన బడి ద్వారా పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పిస్తున్నారు. ఇక తాజాగా పాఠశాలలకు ట్యాబ్‌లు సమకూర్చారు. జిల్లాలో 1,006 పాఠశాలలు ఉండగా పది మంది కంటే ఎక్కువ విద్యార్థులు ఉన్న ఉన్న పాఠశాలలకు ట్యాబ్‌లు ఇస్తున్నారు. 150మంది కంటే విద్యార్థులు ఎక్కువగా 13 పాఠశాలలకు రెండేసి, మిగతా పాఠశాలలకు ఒక్కో ట్యాబ్ అందజేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వీటి ద్వారా యు డైస్, యూ డైస్ ప్లస్ వంటి కార్యక్రమాల వివరాలు నమోదు చేస్తారు. ఫొటో తీయడం, వివరాలు నమోదు వీటితో సులువవుతుందని, ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేయొచ్చని చెబుతున్నారు.

**విద్యపై ప్రత్యేక శ్రద్ధ**



రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతోంది. తద్వారా ప్రైవేట్ పాఠశాలల్లో లేని అనేక సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాలల్లో సమకూరాయి. ఈవిషయాన్ని గుర్తించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి.

– రామకృష్ణ, సెక్టోరియల్ అధికారి

**విద్యార్థులకు ఉపయోగం**



ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు కేటాయించిన ట్యాబ్‌ల ద్వారా సమగ్ర సమాచారం నమోదు చేయొచ్చు. విద్యార్థుల సౌకర్యం కోసం ఉన్నత పాఠశాలలకు డిజిటల్ టీవీలు సమకూర్చాం. వీటి ద్వారా పాఠాలు బోధించడమే కాక బోర్డుగా ఉపయోగించుకునే వెసులుబాటు ఉంది.

– సోమశేఖరశర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

## మొక్కల సంరక్షణ అందరి బాధ్యత





డైరెక్టరీని ఆవిష్కరించిన మంత్రి పువ్వాడ, పక్కన ఎమ్మెల్సీ మధు, కలెక్టర్ గౌతమ్, మేయర్ నీరజ, సీపీ వారియర్, డీఎఫ్‌ఓ సిద్ధార్థ తదితరులు (ఇన్‌సెట్) ఎల్‌బీ.నగర్ కాల్వకట్టపై మొక్క నాటుతున్న మంత్రి పువ్వాడ తదితరులు

- జీవన విధానంగా మార్చుకుంటేనే పచ్చదనం
- రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంఅర్బన్: మొక్కలు నాటడం, సంరక్షించడం అందరి జీవన విధానంలో భాగం కావాలని, తద్వారా జిల్లా, రాష్ట్రం పచ్చదనాన్ని సంతరించుకుంటుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. తెలంగాణ ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ మదిలో మెదిలిన ఆలోచన ద్వారా మొదలైన హరితహారం ద్వారా ఇప్పటికే గణనీయమై మార్పు వచ్చిందని చెప్పారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సోమవారం హరితోత్సవం నిర్వహించారు. ఈమేరకు ఖమ్మం వెలుగుమట్లలోని అటవీ పార్కు, 8వ డివిజన్ ఎల్.బీ.నగర్‌లో ఎమ్మెల్సీ తాతా మధు, కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌తో కలిసి మంత్రి మొక్కలు నాటి మాట్లాడారు. రాష్ట్రం పచ్చలహారంలా మారాలనే ఉద్దేశంతోనే ప్రతిష్టాత్మకంగా తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో అడవులు ఆరు శాతం మేర పెరిగాయని చెప్పారు. అయితే, ప్రభుత్వం, ఉద్యోగుల బాధ్యతగా భావించకుండా ప్రజలంతా భాగస్వాములైతే మెరుగైన ఫలితాలు వస్తాయని తెలిపారు. కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ హరితోత్సవం సందర్భంగా జిల్లాల్లో 2.50 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నా వర్షాభావంతో సాధ్యం కాలేదని చెప్పారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ జిల్లా వాసి, పద్మశ్రీ వనజీవి రామయ్యను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో సీపీ విష్ణు ఎస్.వారియర్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు కలెక్టర్ స్నేహలత, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, డీఎఫ్ఓ సిద్దార్థ విక్రమ్‌సింగ్, కార్పొరేటర్ రావూరి కరుణ సైదబాబు, జెడ్పీటీసీ ప్రియాంక, అటవీశాఖ అధికారులు రాధిక, వేణుమాధవ్‌తో పాటు సంక్రాంతి నాగేశ్వరరావు, వాంకుడోత్ సురేష్, పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యాన నర్సరీల వివరాలతో రూపొందించిన డైరెక్టరీని ఆవిష్కరించారు.

## విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**అధికారులతో సమీక్షలో కలెక్టర్ గౌతమ్**

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం ఆయన విద్యాశాఖ, ఇంజనీరింగ్ అధికారులతో విద్యాదినోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో పండుగ వాతావరణం ఉట్టిపడేలా అలంకరణ చేయాలని, డిజిటల్ తరగతుల, ఇంటరాక్ట్ బ్లాక్ ప్యానెళ్లను ప్రారంభించాలని తెలిపారు. అలాగే, విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేయాలన్నారు. గుర్తించిన పాఠశాలల్లో రాగి జావ పంపిణీ చేయాలని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజాప్రతినిధులు, పెద్దలను ఆహ్వానించి మన ఊరు–మన బడి ద్వారా చేపట్టిన పనులు, విద్యా రంగంలో ప్రగతిని వివరించాలని సూచించారు. వీసీలో అదనపు కలెక్టర్ స్నేహలత, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, డీఈఓ సోమశేఖర శర్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ స్నేహలత, డీఈఓ శర్మ తదితరులు

**ఏర్పాట్లను పరిశీలించిన డీఈఓ**

ఖమ్మంఅర్బన్: విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు ఉండాలని డీఈఓ సోమశేఖర్ శర్మ సూచించారు. ఖమ్మం రోటరీనగర్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆయన ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేశఋరు. ఏఎంఓ రవికుమార్, సీఎంఓ రాజశేఖర్, సెక్టోరియల్ అధికారి రామకృష్ణ, డీసీసీబీ కార్యదర్శి నారాయణతో పాటు ,ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మోత్కూరి మధు, వేముల మాధవరావు, వీరస్వామి, నాగేశ్వరరావు, జీ.ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణంలో మార్పు

- అక్కడక్కడా మేఘావృతమైన ఆకాశం
- అయినా కొనసాగిన ఎండ ప్రభావం
- పొడి దుక్కుల్లో నాటిన విత్తనాలపై ఆశలు వదిలేసిన రైతులు



కొణిజర్లలో దుక్కి దున్నతున్న రైతు

ఖమ్మంవ్యవసాయం: ఎట్టకేలకు మంగళవారం వాతావరణంలో కొంత మేర మార్పు కనబడింది. అయితే ఎండ ప్రభావం మాత్రం తగ్గలేదు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలోని పలుచోట్ల ఆకాశం మేఘావృతమైట్లు చెబుతున్నా ఉక్కపోత, ఎండవేడితో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఉదయం ఎండ తీవ్రత అంతంత మాత్రంగా ఉండగా ఆతర్వాత తీవ్రరూపం దాల్చింది. రుతుపవనాలు త్వరలోనే తాకే అవకాశముందని, తద్వారా తేలికపాటి వర్షాలు కురవొచ్చని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే, ఆదివారం సాయంత్రం అక్కడక్కడా వర్షపు జల్లులు కురవడంతో జూన్ మూడో వారం వచ్చినా సాగు పనులు మొదలుపట్టని రైతుల్లో రైతుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. అలాగే, ఎండవేడితో ఇబ్బంది పడుతున్న ప్రజలు కూడా వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు.

**మట్టిపాలైన విత్తనాలు**

మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసే వర్షాలతో పలు ప్రాంతాల రైతులు వానాకాలం సాగు కోసం దుక్కులు చేసుకున్నారు. సాధారణంగా జూన్ ఆరంభమైందంటే వర్షాలు కురుస్తాయనే ఆశతో రైతులు సిద్ధం చేసిన పొడి దుక్కుల్లోనే విత్తనాలు నాటారు. అలాగే, ప్రభుత్వం కూడా ప్రకృతి వైపరీత్యాలను దృష్టిలో పెట్టుకొని ఈ ఏడాది పంట కాలాన్ని ముందుకు తీసుకురావాలని నిర్ణయించింది. జూన్ 5వ తేదీ నుంచే వరి రకాలను సాగు చేయాలని సూచించగా, పత్తి, అపరాలు వంటి పంటలను రైతులు సాధారణంగా తొలకరి సమయంలో సాగు చేస్తారు. జిల్లాలో ఇప్పటివరకు రైతులు వర్షాలపై నమ్మకంతో పత్తి విత్తనాలను పొడి దుక్కుల్లో నాటారు. ఇప్పటి వరకు 25 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగైనట్లు అధికారులు చెబుతుండగా, అంతకు మించే ఉంటుందని రైతులు అంటున్నారు. వైరా, ఖమ్మం, మధిర, కూసుమంచి వ్యవసాయ డివిజన్లలో పత్తి, పెసర విత్తనాలను పొడి దుక్కుల్లో వేశారని సమాచారం. అలాగే, పొడి దుక్కుల్లోనే వెదజల్లే పద్ధతిలో వరిని 970 ఎకరాల్లో వేశారని వ్యవసాయ శాఖ చెబుతోంది. అయితే, నేలలో తేమ శాతం లేక ఆ విత్తనాలన్నీ పాడైనట్లేనని రైతులు ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు మాత్రం 60 మి.మీ. వర్షపాతం కురిస్తేనే విత్తనాలను నాటాలని సూచిస్తుండడంతో అన్నదాతల ఆశగా ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు.

**కొనసాగిన ఎండ తీవ్రత**

ఆకాశం మేఘావృతమై ఉండి, వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నా ఎండ తీవ్రత మాత్రం ప్రభావాన్ని చూపింది. జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు 35.9 నుంచి 44.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా నేలకొండపల్లిలో 44.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, బాణాపురంలో 43.1, మధిర మండలం సిరిపురంలో 42.3, ఎర్రుపాలెంలో 42.0, చింతకాని మండలం నాగులవంచలో 41.8, కొణిజర్ల మండలం పెద్దగోపతి, కామేపల్లి మండలం లింగాలలో 41.7, తిరుమలాయపాలెం మండలం కాకరవాయి, కొణిజర్ల, చింతకాని, రఘునాథపాలెంలో 41.4, ప్రకాష్‌నగర్‌లో 41.2, తిరుమలాయపాలెం మండలం బచ్చోడు, పెనుబల్లిలో 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## విచారణ ప్రక్రియ పూర్తి చేయండి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఓటరు జాబితాకు సంబంధించి దరఖాస్తుల పరిశీలన, పరిష్కారాన్ని వెంటనే పూర్తిచేయాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం ఆయన ఆర్వోలు, తహసీల్దార్లు, బూత్ స్థాయి సూపర్‌వైజర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఫాం-6కు సంబంధించి అందిన 14,586 దరఖాస్తులను పరిష్కారం మంగళవారం నాటికి పూర్తిచేయాలని తెలిపారు. అలాగే, ఫాం-7, 8కు దరఖాస్తులకు తక్షణమే పరిష్కరించాలని చెప్పారు. అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు. కాగా, హరితోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ స్నేహలత, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, డీఆర్డీఓ విద్యాచందన, డీవైఎస్ఓ పరంధామరెడ్డి మొక్కలు నాటారు. అలాగే, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యాన కార్పొరేట్ కళాశాలల పథకంలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు కలెక్టర్ ధృవపత్రాలు అందజేశారు. సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

**రద్దయినా ఫిర్యాదులు**

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో అధికార యంత్రాంగం నిమగ్నమైన నేపథ్యాన కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డేను రద్దు చేశారు. అయినప్పటికీ వచ్చిన పలువురు విషయం తెలుసుకుని ప్రజావాణి కౌంటర్లలో ఫిర్యాదులు అందించారు. అదే సమయాన కలెక్టర్ గౌతమ్ రావడంతో పలువురి నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తామని తెలిపారు.

## ఉత్తమ హరితనగరంగా ఖమ్మం



మంత్రి ఐ.కే.రెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న మేయర్, ఏఎంసీ, డిప్యూటీ మేయర్



మంత్రుల నుంచి అవార్డు అందుకుంటున్న రఘునాథపాలెం సర్పంచ్

**అవార్డు అందుకున్న మేయర్, అధికారులు**

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు మరో అవార్డు లభించింది. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కేఎంసీని ఉత్తమ హరిత నగరంగా ప్రకటించింది. హరితోత్సవంలో భాగంగా సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకల్లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా మేయర్ పునుకొల్లు నీరజ, అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా ఈ అవార్డు అందుకున్నారు.

**రఘునాథపాలెం పంచాయతీకి..**

రఘునాథపాలెం: హరితహారంలో భాగంగా అత్యధిక మొక్కలు నాటి సంరక్షించినందుకు గాను అటవీ శాఖ ద్వారా జిల్లాలో రఘునాథపాలెం ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపికైంది. ఈమేరకు హైదరాబాద్‌లో సోమవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర హోం శాఖ, అటవీ శాఖ మంత్రులు మహమూద్ అలీ, ఇంద్రకరణ్‌రెడ్డి సర్పంచ్ గుడిపుడి శారదరామారావు, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్‌కుమార్‌కు అవార్డుతోపాటు ప్రశంసాపత్రం అందజేశారు.

## జిల్లాలో కేపీ కలకలం..

- డ్రగ్స్ కేసులో అరెస్ట్ అయిన నిర్మాత కే.పీ.చౌదరి స్వస్థలం బోనకల్
- 'కబాలి'కి ఖమ్మం వాసుల ఫైనాన్స్
- త్వరలోనే జిల్లాకు ఎస్ఓటీ బృందం

ఖమ్మంక్రైం: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన డ్రగ్స్ రాకెట్‌లో ఇటీవల అరెస్ట్ అయిన సినీ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ కే.పీ.చౌదరి అలియాస్ కృష్ణప్రసాద్ జిల్లా వాసి కావడంతో కలకలం రేపుతోంది. జిల్లాలోని బోనకల్ మండలానికి చెందిన ఆయన ఆ ప్రాంతంతో పాటు ఖమ్మంలోని పలువురు స్థిరాస్తి వ్యాపారులతో సంబంధాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. గోవా, హైదరాబాద్‌ల్లో హోటల్ వ్యాపారాలు చేసే సమయంలో అంతర్జాతీయ డ్రగ్ స్మగ్లర్లు అయిన నైజీరియన్లతో పరిచయం ఏర్పడగా డ్రగ్స్ సరఫరా స్థాయికి ఎదిగినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. దీంతో ఖమ్మంలో ఆయనతో సంబంధాలు ఉన్న వారి వివరాలు ఆరా తీసేందుకు త్వరలోనే ఎస్ఓటీ(స్పెషల్ ఆపరేషన్ టాస్క్ ఫోర్స్) బృందం రానున్నట్లు తెలిసింది.

**సన్నిహితుల ఫైనాన్స్**

టాలీవుడ్‌తోపాటు కోలీవుడ్ సినీ ప్రముఖులతో పరిచయం ఉన్న కే.పీ.చౌదరి 'కబాలి' సినిమాకు నిర్మాతగా వ్యవహరించారు. ఆయన సన్నిహితులైన ఖమ్మంకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఫైనాన్స్ చేసినట్లు ఎస్ఓటీ పోలీసుల విచారణలో తేలిందని సమాచారం. నగరంలోని గేటెడ్ కమ్యూనిటీలో ఇల్లు అద్దెకు తీసుకున్న చౌదరి ఖమ్మం వచ్చినప్పుడల్లా విందు ఇచ్చేవాడని, తన సన్నిహితులను సినీ నటులకు పరిచయం చేయడంతో పాటు హైదరాబాద్, గోవాలోని రిసార్ట్స్‌కు ఆహ్వానించేవాడని సమాచారం. అక్కడ డ్రగ్స్ భాగస్వాములను పరిచయం చేశాడని చెబుతున్నారు.

**తొమ్మిది సెల్‌ఫోన్ల ఆధారంగా..**

కే.పీ.చౌదరి తొమ్మిది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు ఖమ్మం, బోనకల్‌కు చెందిన ఆయన సన్నిహితులు, వ్యాపారుల కాల్‌డేటా ను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఆయన సన్నిహితులకు డ్రగ్స్ వ్యాపారంతో సంబంధం ఉన్నట్లు తేలితే విచారణకు ఎస్ఓటీ బృందం ఖమ్మం రానున్నట్లు తెలుస్తోంది. ఈఅంశంపై తమకెలాంటి సమాచారం అందలేదని జిల్లా పోలీసులు చెబుతున్నారు.

## క్లుప్తంగా

### నేడు జిల్లాలో మంత్రి పర్యటన

**ఖమ్మంమయూరిసెంటర్:** రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు రఘునాథపాలెం కేజీబీవీలో అదనపు తరగతి గదులు, ప్రయోగశాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత నగరంలోని పాండురంగాపురం జెడ్పీహెచ్ఎస్, రోటరీనగర్ జెడ్పీహెచ్ఎస్, ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల, నయబజార్, ఎన్ఎస్‌పీ క్యాంపులోని ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. ఆతర్వాత సాయంత్రం డీపీఆర్‌సీ భవనంలో జరిగే విద్యాదినోత్సవం వేడుకల్లో మంత్రి పాల్గొననున్నారు.

### జమలాపురంలో జిల్లా రిజిస్ట్రార్ పూజలు


జిల్లా రిజిస్ట్రార్‌ను సత్కరిస్తున్న అర్చకులు

**ఎర్రుపాలెం:** మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో జిల్లా రిజిస్ట్రార్ అశోక్‌కుమార్ సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆయనకు అర్చకులు, సిబ్బంది స్వాగతం పలకగా శ్రీవారితో పాటు అమ్మ వార్లను దర్శించుకున్నారు. మధిర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగి గంటా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

### 'ఐలు' రాష్ట్ర అధ్యక్షుడికి అభినందనలు


సత్యనారాయణ

**ఖమ్మంలీగల్:** అఖిల భారత న్యాయవాదుల సంఘం(ఐలు) రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన కొల్లి సత్యనారాయణను సోమవారం పలువురు న్యాయవాదులు అభినందించారు. ఈ సందర్భంగా ఖమ్మం బార్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, న్యాయవాదులు మలీదు నాగేశ్వరరావు, తాజుద్దీన్ బాబా, గంగాధర్, జాలావతి, పద్మావతి ఆయనను అభినందించగా, సత్యనారాయణ మాట్లాడారు. నూతన జిల్లాల్లో మౌలిక సదుపాయాలు, కోర్టు భవనాల నిర్మాణం కోసం కృషి చేస్తానని తెలిపారు. అంతేకాకుండా న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తామని, మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రూ.6లక్షల పరిహబూరం ఇప్పించేలా చూస్తానని తెలిపారు. న్యాయవాదుల పరిరక్షణ చట్టం సాధనకు కృషి చేస్తామని వెల్లడించారు.

### గ్రంథాలయాలను పరిశీలించిన జెడ్పీ సీఈఓ


లక్ష్మీపురంలో గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ అప్పారావు

**బోనకల్:** మండలంలోని లక్ష్మీపురం, ముష్టికుంట్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాలను జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని, నిరంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యవేక్షించాలని సూచించారు. ఎంపీడీఓ వేణుమాధవ్, ఎంపీపీ కంకణాల సౌభాగ్యం, సర్పంచ్ నన్నక లక్ష్మి, ఎంపీఓ శాస్త్రి, ఎంపీటీసీ కిలారు వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

### మోడల్ కెరీర్ సెంటర్‌లో రేపు జాబ్ మేళా

**ఖమ్మం స్పోర్ట్స్:** నిరుద్యోగ యువత కోసం ఈనెల 21న టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జాబ్‌మేళా ఏర్పాటుచేసినట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరాం తెలిపారు. టాటా క్యాపిటల్ ఫైనాన్సియల్ సర్వీసెస్, రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో 125 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వయస్సు ధృవీకరణపత్రాలు, విద్యార్హతలు, అనుభవం సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకల్లా హాజరుకావాలని సూచించారు.

### ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

| | గరిష్ట | కనిష్ట |
|---|---|---|
| మొక్కజొన్న | 1,800 | 1,400 |
| పెసలు | 7,360 | 6,700 |
| కందులు | 8,800 | 8,800 |
| మిర్చి | 20,000 | 12,500 |
| ఏసీ మిర్చి | 24,600 | 18,500 |
| మిర్చి తాలు | 13,000 | 8,000 |
| పత్తి | 6,850 | 5,000 |

– ఖమ్మం వ్యవసాయం

### పామాయిల్ గెలలు

| | |
|---|---|
| టన్ను ధర | రూ.13,346 |

# దరఖాస్తు చేసుకుంటామా, లేదా?!

## ఆందోళనలో కుల, చేతి వృత్తిదారులు

- ఆదాయ, కుల ధృవీకరణ పత్రాల జారీలో జాప్యంతో ఇక్కట్లు
- రూ.లక్ష సాయంపై లబ్ధిదారుల్లో మీమాంస
- జిల్లాలో ఇప్పటి వరకు 20,249 దరఖాస్తులు


ఖమ్మం అర్బన్ తహసీల్‌లో దరఖాస్తుదారుల రద్దీ (ఫైల్)

**ఖమ్మంమయూరిసెంటర్:** బీసీ వర్గాల్లో కుల, చేతివృత్తిదారులకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయం కోసం జిల్లాలో పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈనెల 6 నుంచి చేతి, కుల వృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తుండగా పలువురి వద్ద కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం తొలుత ప్రకటించిన దరఖాస్తు గడువు మంగళవారంతో ముగియనుండడం, ఇంకా వేలాది మందికి సర్టిఫికెట్లు అందకపోవడంతో మీమాంస నెలకొంది. అయితే, ప్రభుత్వం మాత్రం దరఖాస్తుల స్వీకరణ, సాయం మంజూరు నిరంతర ప్రక్రియ అని చెబుతున్నా కుల, చేతివృత్తిదారులు మాత్రం దరఖాస్తు చేసుకునేందుకు బారులు తీరుతున్నారు.

**అందని ధృవీకరణ పత్రాలు**

వెనుకబడిన తరగతుల్లో ఎంబీసీలకు తొలివిడతగా ఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నాయీబ్రాహ్మణులు, రజక, సగర/ఉప్పర, కుమ్మరి/శాలివాహన, అవుసల, కంసాలి, కమ్మరి, కంచరి, వడ్ల/వడ్ర/వడ్రంగి, శిల్పులు, కృష్ణ బలిజ పూసల, మేదర, వడ్డెర, ఆరె కటిక, మేర, ఎంబీసీలు రూ.లక్ష స్కీం వర్తించే బీసీ కులాలుగా పేర్కొన్నారు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతో ఓబీఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించగా, పత్రాల కోసం మీ సేవా కేంద్రాలకు పోటెత్తుతున్నారు. దీంతో ఇటీవల తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక మేళా ఏర్పాటుచేసినా ఇంకా అందరికీ సర్టిఫికెట్లు అందకపోవడంతో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

**సాంకేతిక సమస్యలతో...**

తొలుత ప్రభుత్వం 20వ తేదీలోగానే దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది. అయితే, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు ఉన్న వారు దరఖాస్తు చేసుకునేందుకు వెళ్తుండగా రెవెన్యూ సర్వర్ మొరాయిస్తోంది. దీంతో రాత్రి 8 గంటల తర్వాత ధృవపత్రాల జారీకి అప్రూవల్ చేస్తున్నారు. ఇక ఓబీఎంఎస్ వెబ్‌సైట్ పరిస్థితి అలాగే ఉండగా... రాష్ట్రమంతా ఒకేసారి దరఖాస్తుకు వస్తుండడంతో ఈ పరిస్థితి తలెత్తుతోందని చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో రాత్రి వేళ సైట్ ఓపెన్ అవుతోందని తెలుస్తోంది.

**20,249 మంది దరఖాస్తు**

ప్రభుత్వం ప్రకటించిన రూ. లక్ష ఆర్థిక సాయం కోసం జిల్లా వ్యాప్తంగా సోమవారం వరకు 20,249 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 10వ తేదీ వరకు 3 వేల దరఖాస్తులు మాత్రమే రాగా.. మిగతా సమయంలో ఇన్ని దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రంలో ఖమ్మం జిల్లా నుంచే అత్యధిక దరఖాస్తులు అందినట్లు అధికారిక వర్గాల ద్వారా తెలుస్తోంది. కాగా, చాలా మందికి కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు అందని విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం దరఖాస్తు గడువు పెంచాలని పలువురు కోరుతున్నారు.

**నేటి నుంచి దరఖాస్తుల పరిశీలన**

రూ.లక్ష ఆర్థిక సాయం కోసం ఈనెల 6 నుండి 20వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా ప్రభుతకు అందిన దరఖాస్తులను మంగళవారం నుంచే మండల స్థాయిలో ఎంపీడీఓలు, మున్సిపాలిటీల్లో కమిషనర్లు 20వ తేదీ నుండి పరిశీలించనున్నారు. కాగా, దరఖాస్తు ప్రక్రియ, ఆర్థిక సాయం మంజూరు నిరంతరం సాగే ప్రక్రియ అని ఇటీవల మంత్రులు వెల్లడించారు. దీంతో ప్రతి నెల 15వ తేదీన జిల్లా కమిటీ ఎంపిక చేసిన కొందరు చొప్పున లబ్ధిదారులకు ఆర్థిక సాయం మంజూరు చేయనున్నారు.

**దరఖాస్తులు చేసుకుంటున్నారు..**



చేతి, కుల వృత్తుల వారికి ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం కోసం జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు చేసుకుంటున్నారు. ప్రభుత్వం మొదటి విధించిన గడువు మంగళవారం వరకు ఉంది. ఆతర్వాత పొడిగింపుపై ఎలాంటి సమాచారం లేదు. రూ.లక్ష ఆర్థిక సాయం కోసం జిల్లా నుండే అత్యధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి.

– జి.జ్యోతి, డీబీసీడీడీ, ఖమ్మం

## కంప్యూటర్ పరిజ్ఞానం అలవర్చుకోవాలి


ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎన్ఆర్ఐల కుటుంబీకులు

**కొణిజర్ల:** విద్యార్థులు చిన్న వయసు నుంచే కంప్యూటర్ పరిజ్ఞానం అలవర్చుకుంటే భవిష్యత్ మంచి ఫలితాలు వస్తాయని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. మండలంలోని తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్ఆర్ఐలు తుళ్లూరి లెనిన్‌చౌదరి, జిల్లెళ్ల మూడి వెంకట్ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. రూ.3.50 లక్షల వ్యయంలో కంప్యూటర్ ల్యాబ్, ఐరన్ గేట్లు, సైకిల్ షెడ్ ఏర్పాటు చేయగా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడడంతో పాటు మొక్క నాటారు. ఈకార్యక్రమంలో లెనిన్‌చౌదరి కుటుంబ సభ్యులు డీఎస్ఎఫ్ ఫౌండేషన్ సభ్యులు రామకృష్ణ, బాబూరావు, నాగేశ్వరరావు, సర్పంచ్ మోహనరావు, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీను, ఎంఈఓ శ్యాంసన్, హెచ్ఎం సూరి తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘం నేతలు

**ఖమ్మంమయూరిసెంటర్:** మున్నూరుకాపు కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి ఆర్థికంగా వెనుకబడిన వారికి చేయుతనివ్వాలని సంఘం నేతలు కోరారు. ఈమేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు పారా నాగేశ్వరరావు ఆధ్వర్యాన మంగళవారం అదనపు కలెక్టర్ మధుసూదన్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మున్నూరు కాపులకు ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఉన్నత చదువులు పూర్తిచేయలేక ఉపాధి, ఉద్యోగ రంగాల్లో వెనుకబడుతున్నారని తెలిపారు. ఈమేరకు మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఏటా రూ.5వేల కోట్లు కేటాయించాలని, ప్రతీ జిల్లా కేంద్రంలో హాస్టల్ భవనాల నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ, రాష్ట్ర కార్యదర్శి శెట్టి రంగారావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు కొత్తా సీతారాములు, గౌరవ సలహాదారులు గుండాల కృష్ణ, మెంతులు శ్రీశైలం, జాబిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో గ్యాస్ లీకేజీ, మంటలు

**నేలకొండపల్లి:** ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని సిద్ధం చేస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సింగారెడ్డిపాలెం ప్రభుత్వ పాఠశాలలో సోమవారం మధ్యాహ్నాన్ని సిద్ధం చేస్తున్న సమయంలో గ్యాస్ లీకై పైపు కాలిపోవటంతో మంటలు వ్యాపించాయి. దీంతో నిర్వాహకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందారు. ఇంతలో సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సిలిండర్ నుంచి స్టౌకు అనుసంధానించిన పైప్ నాసిరకంది కావడంతో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. అయితే, సకాలంలో మంటలు ఆర్పగా ఎవరికీ ఏం కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఘటనా స్థలాన్ని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకయ్య పరిశీలించి హెచ్ఎం శ్రీనివాస్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు.

## ఉప సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

**నేలకొండపల్లి:** మండలంలోని రాజేశ్వరపురం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ చిట్యాల రమేష్ జాయింట్ చెక్ పవర్‌ను రద్దు చేశారు. అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు చెక్కులపై సంతకాలు చేయకుండా ఇబ్బంది పెడుతున్నట్లు తేలడంతో కలెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దాదాపు రూ.5,58,388 విలువైన చెక్కులపై సంతకాలు చేయడం లేదని ఎంపీడీఓ, ఎంపీఓ దృష్టికి సర్పంచ్ దండా పుల్లయ్య తీసుకెళ్లగా వారు విచారణ చేపట్టిన మార్పు రాకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో నిర్వహించిన గ్రామసభలో ఉప సర్పంచ్ జాయింట్ చెక్ పవర్ తొలగించి ఆరో వార్డు సభ్యురాలు పుసులూరి శారదకు ఇవ్వాలని తీర్మానించారు. ఈమేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.



## రామాలయ అర్చకుడు మృతి

**భద్రాచలం:** భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ముఖ్య అర్చకుడు పొడిచేటి గోపాలకృష్ణమాచార్యులు (63) మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందారు. ఆయన కుమారుడు అచ్చుతాకుమారాచార్యులు పరిచారక అర్చకుడిగా పనిచేస్తున్నారు.



# తొలగించిన ఆర్టిజన్లకు పోస్టింగ్

## దూర ప్రాంతాల్లో నియామకం

**ఖమ్మంవ్యవసాయం:** విద్యుత్ శాఖలో ఇటీవల తొలగించిన ఆర్టిజన్లను తిరిగి విధుల్లోకి తీసుకొని పోస్టింగ్ ఇస్తున్నారు. సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, స్టాండింగ్ ఆర్డర్లు రద్దు చేయాలని, విద్యార్హత ఆధారంగా కన్వర్షన్ ఇవ్వడమే కాక 50 శాతం పీఆర్సీ అమలు చేయాలనే తదితర డిమాండ్లతో ఏప్రిల్ 25న తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్-82, ఈతేహైద్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్లు సమ్మెకు దిగాయి. ఈ క్రమంలో అత్యవసర సేవల విభాగం కిందకు వచ్చే విద్యుత్ శాఖ ఉద్యోగులు సమ్మె చేయడం చట్టవిరుద్ధమని యజమాన్యం ప్రకటించినా సమ్మెలో పాల్గొన్నారు. దీంతో ఎన్పీడీసీఎల్ ఖమ్మం విద్యుత్ సర్కిల్ ఆపరేషన్స్ పరిధిలో సమ్మెలో పాల్గొన్న నలుగురు, ట్రాన్స్‌కోలో పనిచేసే ముగ్గురితో పాటు పాల్వంచ జెన్‌కోలో పనిచేసే ముగ్గురిని అప్పట్లో ఉద్యోగం నుంచి తొలగించారు. అయితే, సమ్మె విరమించాక రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డితో జరిగిన చర్చల్లో తొలగించిన ఆర్టిజన్లను తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు సమ్మతించారు. ఈ క్రమంలోనే వారిని విధుల్లో తీసుకున్నా ప్రస్తుతం పనిచేసే ప్రాంతాల్లో కాక దూర ప్రాంతాల్లో పోస్టింగ్ ఇచ్చారు. ఖమ్మం విద్యుత్ సర్కిల్ ఆపరేషన్స్‌లో తొలగించిన నలుగురు ఉద్యోగుల్లో ఇద్దరిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో, ఒకరిని మహబూబాబాద్, ఇంకొకరికి వరంగల్ జిల్లాల్లో పోస్టింగ్ ఇస్తూ ఎన్పీడీసీఎల్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే, ట్రాన్స్‌కో నుంచి తొలగించిన ముగ్గురిలో ఇద్దరికి జూలూరుపాడు డివిజన్‌కు, మరొకరికి సీతారాంపట్నం(పాల్వంచ)లో పోస్టింగ్ ఇచ్చారు. ఇక పాల్వంచ జెన్‌కోలో పనిచేసే ముగ్గురికి శ్రీశైలం, నాగార్జున సాగర్‌లలో పోస్టింగ్ ఇవ్వడం గమనార్హం. ఇక ఆయా ప్రాంతాల్లో సమ్మెలో పాల్గొని ఉద్యోగాల నుంచి తొలగించబడిన వారిని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు కేటాయించారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాకు నిజామాబాద్ జిల్లా ఆర్టిజన్లను కూడా కేటాయించగా వారు విధుల్లో చేరుతున్నారు. ఏప్రిల్ 25 నుంచి తొలగించబడిన ఆర్టిజన్లకు 50 రోజులకు పైగా వేతనాలు నిలిచిపోగా, ఇప్పుడు వారు విధుల్లో చేరటంతో వేతనాలు అందే అవకాశం ఉంది.

## బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పుల్లారావు


పుల్లారావుకు నియామకపత్రం అందజేస్తున్న కృష్ణయ్య

**కల్లూరు:** జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లింగనబోయిన పుల్లారావు నియమితులయ్యారు. హైదరాబాద్‌లో సోమవారం ఆయనకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య నియామకపత్రాన్ని అందజేశారు. సంఘం పటిష్టతకు పాటుపడుతున్న పుల్లారావు కృషిని గుర్తించి ఈ పదవిలో నియమించామని తెలిపారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోదేపల్లి కృష్ణమాచారి, జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పోరాడితేనే ఇళ్లు, స్థలాలు

## రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్


ధర్నా శిబిరంలో సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు

**ఖమ్మంమయూరిసెంటర్:** పోరాడితేనే అర్హులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు వస్తాయని రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, నాయకులు నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఎర్రజెండాల పోరాట ఫలితంగానే ఖమ్మం చుట్టుపక్కల కొత్త కాలనీలు ఏర్పాటయ్యాయని చెప్పారు. సీపీఎం ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యాన సోమవారం ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం నిర్వహించిచిన ధర్నాలో వారు మాట్లాడారు. సొంత స్థలం ఉన్నవారు ఇల్లు నిర్మించుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.15లక్షలు ఇవ్వాలన్నారు. ఇళ్లు లేని వారికి స్థలాలు ఇవ్వాలని చేసిన పోరాటాల ఫలితంగానే 6,800 మందిని అర్హులుగా నిర్ధారించారని తెలిపారు. కాగా, కేసీఆర్ ప్రభుత్వం కేవలం 2వేల మందికి మాత్రమే డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చిందని, మిగతా వారికి స్థలాలు, ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శైలజకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయు రాష్ట్ర నాయకులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం, నాయకులు వై.విక్రమ్, యర్రా శ్రీనివాస్, నవీన్ రెడ్డి, మాచర్ల భారతి, మేకల సంగయ్య, రమ్య, భూక్యా శ్రీనివాస్, ఎం.ఏ.జబ్బార్, బోడపట్ల సుదర్శన్ పాల్గొన్నారు.

## నంది విగ్రహం చోరీ

**తొలుత పూజలు చేసిన దుండగులు**

**వైరారూరల్:** మండలంలోని నారపునేనిపల్లిలో వైరా నది పక్కన ఉన్న పురాతన శ్రీ చంద్రశేఖర స్వామి దేవాలయం లో రాతి నంది విగ్రహం చోరీకి గురైంది. గత శనివారం అర్ధరాత్రి చోరీ జరగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దేవాలయం ముఖ మండపం, గర్భగుడి తలుపుల తాళాలను పగులగొట్టిన దుండగులు ఆలయంలోకి ప్రవేశించారు. ఆలయంలో నిమ్మకాయలు, పసుపు, కుంకుమలతో పూజలు చేశాక రాతి నంది విగ్రహాన్ని దొంగిలించారు. ఆదివారం ఉదయం ఈ విషయాన్ని అర్చకుడు గుర్తించి దేవాదాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, 300 ఏళ్ల చరిత్ర కలిగిన దేవాలయంలో దొంగతనం జరగడం గ్రామంలో కలకలం రేపింది.

## కుటుంబ కలహాలతో ఆత్మహత్య


రమేష్ (ఫైల్)

**మధిర:** కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధిర మున్సిపాలిటీ పరిధిలోని అంబారుపేటకు చెందిన వి.రమేష్(25) గ్రామ సమీపంలోనిస్విమ్మింగ్ పూల్‌లో పనిచేస్తున్నాడు. రమేష్‌కు మూడేళ్ల క్రితం వివాహం జరగగా, భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో ఆమె ఇటీవల పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన రమేష్ సోమవారం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనపై మధిర టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అట్టపెట్టెలో మగ శిశువు

## తహసీల్‌లో మృతదేహాన్ని పడేసిన వైనం

**ఖమ్మంక్రైం:** మానవత్వానికే మచ్చ తీసుకొచ్చే ఘటన ఇది. ఆరు నెలల వయస్సు గల మగశిశువు మృతదేహాన్ని అట్టపెట్టెలో పెట్టి ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు పడేసి వెళ్లారు. ఖమ్మంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక చిన్న సందులో ఓ అట్ట పెట్టె ఉండడంతో వాచ్‌మెన్ ఉమ సోమవారం ఉదయం పరిశీలించగా మగ శిశువు మృతదేహం కనిపించింది. దీంతో ఆమె ఇచ్చిన సమాచారంతో తహసీల్దార్ శైలజకు త్రీటౌన్ పోలీసులకు తెలిపారు. సీఐ సత్యనారాయణ, సిబ్బందితో చేరుకుని విచారణ చేపట్టారు. కాగా, తహసీల్ పక్కనే విద్యార్థినుల వసతి గృహం ఉండటంతో అక్కడి వారే పడేసి ఉంటారా, లేక బీసీ రుణాల కోసం ధృవీకరపత్రాలు తీసుకునేందుకు వచ్చే వారితో రద్దీ ఉంటుండగా గుర్తుతెలియని వ్యక్తులు అట్టపెట్టెను వేసి ఉంటారా అనే కోణంలో విచారిస్తున్నారు. కార్యాలయం వెనుక భాగంలో లైట్లు లేకపోవడం, ఆదివారం సెలవు కావడంతో ఈ పెట్టె వేసినట్లు తెలుస్తుండగా, సోమవారం బయటపడింది.

## వెలుగుమట్ల పార్కు సమీపంలో మంటలు

**ఖమ్మంఅర్బన్:** నగరంలోని వెలుగుమట్ల అటవీ పార్కు సమీపాన సోమవారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. దీంతో సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పారు. పార్కు సమీపంలోని పొలాల రైతులు చెత్తకు నిప్పు పెట్టగా మంటలు చెలరేగి పార్కు వైపు వస్తున్నట్లు గుర్తించారు. దీంతో అటవీశాఖ అధికారులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక శాఖ ఉద్యోగులు చేరుకుని మంటల పార్కులోకి రాకుండా నిలువరించారు. ఈ ఘటనలో పార్కుకు ఎలాంటి నష్టం జరగలేదని అటవీశాఖ అధికారి వేణుమాధవ్ తెలిపారు.


## మద్యం మత్తులో యువకుల వీరంగం

**వైరా:** మద్యం మత్తులో ఇద్దరు యువకులు పలువురిపై దాడి చేసిన ఘటన వైరా రింగ్ రోడ్డు సెంటర్‌లోని ఓ వైన్స్ షాపు ఎదుట సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొణిజర్లకు చెందిన శశికుమార్, రాజేష్ సోమవారం రాత్రి మద్యం సేవించారు. ఆ మత్తులో ఉన్న వీరంగం సృష్టిస్తూ ఐదుగురు వ్యక్తులపై దాడి చేశారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో చేరుకున్న పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా ఇరువురు అధిక మోతాదులో మద్యం సేవించినట్లు తెలింది. దీంతో వారిని స్టేషన్‌కు తరలించారు.

## క్లుప్తంగా...

### అవినాశ్ రెడ్డి బెయిలు రద్దుపై విచారణ వాయిదా

- 3కు వాయిదా వేసిన సుప్రీంకోర్టు
- కౌంటర్ల దాఖలుకు అవినాశ్, సీబీఐకి నోటీసులు



సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి ముందస్తు బెయిలు రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. వివేకా కుమార్తె సునీత దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను సోమవారం న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన వెకేషన్ బెంచ్ విచారించింది. సునీత తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదనలు వినిపిస్తూ.. వివేకా హత్య తదనంతర పరిణామాలు, సీబీఐ దర్యాప్తు ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు బదిలీ కావడం వంటి అంశాలను న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. ఈ నెల 30 నాటికి దర్యాప్తు పూర్తి చేయాలని సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించిందని ఆయన గుర్తు చేశారు. అనంతరం తదుపరి విచారణను వచ్చే నెల 3కు వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. అప్పటికల్లా కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులైన అవినాశ్ రెడ్డి, సీబీఐలకు నోటీసులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నుంచి ఆదేశాలు తీసుకొని సీజేఐ ధర్మాసనం వద్ద పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌తో ఈ పిటిషన్‌ను కూడా జత చేసి జూలై 3న జాబితాలో చేర్చాలని రిజిస్ట్రీని కోర్టు ఆదేశించింది.

### బీఆర్‌ఎస్‌లోకి మహారాష్ట్ర నేతలు

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రలోని పలు పార్టీలకు చెందిన నాయకులు, ప్రముఖులు బీఆర్‌ఎస్ అధినేత సీఎం కేసీఆర్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. వారిలో బీడ్ జిల్లా బీజేపీ కార్యదర్శి మయూరి ఖేద్కర్, ఔరంగాబాద్ జిల్లా ఎన్సీపీ కార్యదర్శి సతీష్ బచాటే, పుణే విధానసభ మాన్సే అధ్యక్షుడు చంద్రకాంత్ సిమ్లా, పుణే మాన్సే యువక్ ఆఘాడీకి చెందిన కళ్యాణ్ కుమార్, చిరంజీవి రాంరావు, జై భగవాన్ మహాసంఘ్ యువ తాలూకా అధ్యక్షుడు పరమేశ్వర్ కేదార్, సర్పంచ్‌లు మహాదేవ్ జవహరే, శరద్ సిర్సాట్, సంజయ్ కేదార్, గణేష్ జయభాయే, భగవాన్ జయభయే, విష్ణు సనప్, సంతోష్ బడే, అర్బాజ్ షేక్ తదితరులున్నారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకుడు మాణిక్ కదమ్ తదితరులున్నారు.



# నా‘నో’ యూరియా!

## లిక్విడ్ యూరియా వాడకంపై ఆసక్తి చూపించని రైతులు

- అర లీటర్ నానో యూరియా 45 కేజీల సాధారణ యూరియాతో సమానం
- భూసార పరిరక్షణ.. ధర తక్కువ..పంటల దిగుబడి ఎక్కువ
- అవగాహన కార్యక్రమాలకు సిద్ధమవుతున్న వ్యవసాయ అధికారులు

భూసారం దెబ్బతినదు. ధర తక్కువ.. లాభాలు కూడా ఎక్కువ. ఇలాంటి ప్రయోజనాలెన్నో ఉన్నా, నానో యూరియా వినియోగంపై రైతులు ఆసక్తి చూపించడం లేదు. నానో యూరియా వ్యవసాయ రంగంలోనే కొత్త విప్లవానికి నాంది అని ప్రభుత్వం, వ్యవసాయశాఖ చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం దానికి ఆశించినంతగా ఆదరణ లభించడం లేదు. నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయ శాఖ వర్గాలు విఫలం కావడమే ఈ పరిస్థితికి కారణమనే విమర్శలు విన్పిస్తున్నాయి.

- సాక్షి, హైదరాబాద్

### లాభాలు ఎక్కువంటున్న శాస్త్రవేత్తలు

కేవలం అర లీటర్ లిక్విడ్ యూరియా (నానో).. 45 కేజీల సాధారణ యూరియాతో సమానం. సాధారణ ఘన రూపంలోని యూరియా కంటే నానో లిక్విడ్ యూరియాతో లాభాలు ఎక్కువ ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అలాగే ప్రస్తుతం రైతులు వినియోగిస్తున్న యూరియాతో భూమికి హాని జరగడంతో పాటు భూసారం తగ్గుతోందని పలు నివేదికలు తెలుపుతున్నాయి. దీంతో పాటు 45 కిలోల బరువుండే యూరియా బస్తాను ఎరువుల దుకాణం నుంచి పొలం వరకు తీసుకెళ్లడం వ్యయ ప్రయాసలతో కూడుకున్న వ్యవహారం. ఈ నేపథ్యంలో యూరియా వాడకాన్ని తగ్గిస్తూ, భూసారాన్ని దెబ్బతీయకుండా ఉండడంతో పాటు ఘన యూరియాతో పోల్చితే లాభాలు అధికంగా వచ్చేలా నానో యూరియా రూపుదిద్దుకుంది. అయితే దీనిపై రైతులు గందరగోళంలో ఉన్నారు. సాధారణ యూరియాకు అలవాటు పడడం వల్ల కూడా రైతులు నానో యూరియాను వినియోగించడానికి అంతగా ఆసక్తి చూపించడంలేదని తెలుస్తోంది.

### అవగాహన కల్పిస్తామంటున్న అధికారులు

నానో యూరియాపై రైతు వేదికల ద్వారా రైతులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తక్కువ ధర, అధిక దిగుబడి లాంటి అంశాలను రైతుల్లో ముమ్మర ప్రచారం చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించామన్నారు. ముందుగా రాష్ట్ర స్థాయిలో పలువురు రైతులతో అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, తర్వాత క్షేత్రస్థాయిలో పొలాలు, రైతు వేదికల వద్ద సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుత వానాకాలం వ్యవసాయ సీజన్‌లో 8 లక్షల బాటిళ్ల నానో యూరియాను రైతులకు అందజేయాలని వ్యవసాయ శాఖ ఎరువుల ప్రణాళికలో ప్రకటించింది.

### రూ. 60 తక్కువ..

500 ఎంఎల్ నానో యూరియా బాటిల్‌లో 40 వేల పీపీఎంల నైట్రోజన్ ఉంటుంది. లిక్విడ్ యూరియాను నీటిలో కలిపి పిచికారీ చేస్తే సరిపోతుంది. ఈ యూరియాను పత్తి, మొక్కజొన్న తదితర 94 పంటల మీద పిచికారీ చేయొచ్చు. కాగా ప్రస్తుతం అందుబాటులో ఉన్న సంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియా తక్కువ ధరకు లభిస్తుంది. అంతే కాదు దీని వాడకం వల్ల పంట దిగుబడి సాధారణ యూరియా కంటే 8% పెరుగుతుందని అంచనా. సబ్సిడీలు పోనూ యూరియా బస్తా ధర రూ.266 ఉండగా... నానో యూరియా బాటిల్ రూ.204కే లభిస్తోంది. అర లీటర్ నానో యూరియాకు సుమారు 127 లీటర్ల నీటిని కలిపి చల్లొచ్చు. రవాణాకు, నిల్వకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. అయినా చాలావరకు రైతులు ఆసక్తి చూపించక పోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ఫెర్టిలైజర్ షాపు యజమానులు 4 యూరియా బస్తాలు కొనుగోలు చేసిన రైతులకు నానో లిక్విడ్ యూరియాను బలవంతంగా అంటగడుతున్నారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి.

# ‘ఉపా’ను రాష్ట్రంలో ప్రయోగించబోమని ప్రకటించాలి

- కేంద్రంలో కూడా ఎత్తేసేలా ప్రయత్నించాలి
- రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలి: ప్రొ.హరగోపాల్



పంజగుట్ట: ఉపా చట్టాన్ని రాష్ట్రంలో ఉపయోగించబోమనీ, కేంద్రంలోనూ ఎత్తేసేలా ప్రయత్నిస్తామని బీఆర్‌ఎస్ ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించాలని నిర్బంధ వ్యతిరేక వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ జి.హరగోపాల్ కోరారు. ఇక్కడి ప్రజలు స్వేచ్ఛగా, స్వతంత్రంగా బతకవచ్చు.. ఇది ప్రజాస్వామ్య తెలంగాణ అని నిరూపించుకోవాలి అని సూచించారు. ప్రజాసంఘాల స్వేచ్ఛను, మాట్లాడే హక్కును దూరం చేస్తున్న అన్యాయమైన ఉపా చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల ఉపా చట్టం కేసులను ఆరుగురిపై రాష్ట్ర ప్రభుత్వం ఎత్తేసిన సంగతి తెలిసిందే. ఆ ఆరుగురిలో నలుగురు ప్రొఫెసర్ హరగోపాల్, పద్మజాషా, పౌరహక్కుల సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రొఫెసర్ గుంట రవి సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ .. తమపై నమోదైన కేసులే మిగిలిన 146 మందిపై కూడా ఉన్నప్పుడు వారిపై కేసులు ఎందుకు ఎత్తివేయలేదని ప్రశ్నించారు.

**21 నుంచి దశల వారీ ఆందోళన**

తమ డిమాండ్ల సాధనకు ఈ నెల 21 నుంచి 25 వరకు సీఎం, మంత్రులకు వినతిపత్రాలు ఇస్తామని, జూన్ 26 నుంచి జూలై 29 వరకు జిల్లాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు, సెమినార్లు నిర్వహిస్తామని, జూలై 30న హైదరాబాద్‌లో ప్రజాస్వామిక వాదులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో బహిరంగ సభ నిర్వహిస్తామని హరగోపాల్ తెలిపారు.

**దేవేందర్‌ను విడుదల చేయాలి**

సిద్దిపేటలో పరీక్ష రాస్తుండగా పోలీసులు అరెస్టు చేసి తీసుకువెళ్లిన దేవేందర్‌ను బేషరతుగా విడుదల చేయాలని ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. దేవేందర్ గతంలో దేశభక్త ప్రజాతంత్రలో పనిచేసింది వాస్తవమే అయినా ఇప్పుడు దానికి దూరంగా ఉన్నాడని తెలిపారు. అరెస్టు చేసి 24 గంటలు అవుతున్నందున వెంటనే కోర్టులో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

# బంగాళాఖాతంలో కలిసేది బీఆర్‌ఎస్సే

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం వస్తుందన్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా సోమవారం రాత్రి నల్లగొండ జిల్లా నకిరేకల్‌లోని మెయిన్ సెంటర్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో భట్టి ప్రసంగించారు. రాష్ట్రంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఎందుకోసం నిర్వహిస్తున్నారని.. ప్యాలెస్ లాంటి ఫామ్‌హౌజ్‌లు కట్టుకున్నందుకా, వేల కోట్లు సంపాదించుకున్నందుకా అని ప్రశ్నించారు. నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం లేకుండా చేస్తున్న బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడేందుకు, సమస్త తెలంగాణ ప్రజల కోసం తాను పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేస్తున్నానని చెప్పారు. ధరణి వల్ల భూమిపై హక్కులు కోల్పోయిన వారికి చట్టబద్ధంగా హక్కులు కల్పిస్తామన్నారు.

**కృష్ణా జలాలను నల్లగొండకు తరలించాలి**

తనది గమ్యం లేని పాదయాత్ర అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అంటున్నారని.. కృష్ణా జలాలను నల్లగొండ జిల్లాకు తరలించాలనేదే తన ఆశయమన్న విషయం గుత్తా తెలుసుకోవాలని భట్టి సూచించారు. చెమట బిందువులను ఓట్లుగా మార్చి నకిరేకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే.. ఆ ఎమ్మెల్యే ప్రలోభాలకు లోనై పార్టీ మారాడని విమర్శించారు. బ్రాహ్మణ వెల్లెంల, ఉదయ సముద్రం ప్రాజెక్టు గురించి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అప్పట్లోనే దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టికి తెచ్చారని.. అప్పట్లో కాంగ్రెస్ సర్కారు రూ.348 కోట్లను ప్రాజెక్టుకోసం ఖర్చుపెట్టిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పీసీసీ ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్, ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్‌లో అసెంబ్లీ షెడ్యూల్!

▶ మొదటి పేజీ తరువాయి

బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని వివరించాయి. ఈ మేరకు 74 మంది డిప్యూటీ కలెక్టర్లు (ఇటీవలే పదోన్నతి పొందిన వారితో కలిపి), 14 మంది డిప్యూటీ కమిషనర్లు, 31 మంది అదనపు కలెక్టర్లను సిద్ధం చేయనున్నట్టు సమాచారం. ఇక అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా 119 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోనికి వచ్చే అన్ని మండలాల తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగించనున్నట్టు తెలిసింది.

**ఏఆర్‌వోల పర్యవేక్షణలో క్షేత్రస్థాయి ఏర్పాట్లు**

నామినేషన్ల ప్రక్రియతోపాటు పోలింగ్ సామగ్రి సమకూర్చుకోవడం, పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, ఈవీఎంలు, బ్యాలెట్ పేపర్లు సిద్ధం చేయడం, పోలింగ్ స్టేషన్లలో కనీస సౌకర్యాల కల్పన వంటి ఏర్పాట్లన్నీ ఏఆర్‌వోల పర్యవేక్షణలో జరగనున్నాయి. ప్రస్తుతం ఓటర్ల జాబితా తయారీలో భాగంగా అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ (ఏఈఆర్‌వో) అధికారులుగా తహసీల్దార్లు పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 4న ఓటర్ల తుది జాబితా ప్రచురణ ఉండటంతో, ఆ తర్వాతే షెడ్యూల్ వస్తుందని రెవెన్యూ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు మార్చి 5–15వ తేదీ మధ్య షెడ్యూల్ వచ్చే అవకాశం ఉందని చెప్తున్నాయి.

**2018లో ముందస్తు ఎన్నికలతో..**

గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు లోక్‌సభ ఎన్నికలతోపాటు 2019 ఏప్రిల్–మే నెలల్లో జరగాలి. కానీ రాష్ట్రంలో రాజకీయ కంగాళీ వాతావరణం ఏర్పడిందని.. తనను, ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని పేర్కొంటూ.. సీఎం కేసీఆర్ ముందస్తు ఎన్నికలకు వెళ్లారు. 2018 సెప్టెంబర్ 6న ప్రభుత్వాన్ని రద్దు చేస్తూ కేబినెట్‌లో తీర్మానించి.. అప్పటి గవర్నర్‌ను నరసింహన్‌కు అందజేయడం, ఆయన వెంటనే ఆమోదించడం, అదే రోజున 105 మంది బీఆర్‌ఎస్ అభ్యర్థులను కేసీఆర్ ప్రకటించడం చకచకా జరిగాయి. అప్పుడు దేశంలో మరో నాలుగు రాష్ట్రాలకూ ఎన్నికల సమయం కావడంతో.. వాటితో పాటు తెలంగాణనూ కలిపి అక్టోబర్ 6న ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. నవంబర్ 12న నోటిఫికేషన్ జారీకాగా డిసెంబర్ 7న పోలింగ్, 11న ఓట్ల లెక్కింపు జరిగాయి. ఆ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మెజారిటీ సీట్లు గెల్చుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

**ఈసారి అదే సమయంలో..!**

ఈసారి కూడా ఆ నాలుగు రాష్ట్రాలతో కలిపి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు చెప్తున్నాయి. 2018లో జరిగిన 5 రాష్ట్రాల్లో ఎన్నికల్లో భాగంగా.. ఛత్తీస్‌గఢ్‌లో నవంబర్ 12, 20 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరిగింది. మధ్యప్రదేశ్, మిజోరం రాష్ట్రాల్లో నవంబర్ 28న, రాజస్తాన్, తెలంగాణ రాష్ట్రాల్లో డిసెంబర్ 7న పోలింగ్ నిర్వహించారు. ఈసారి కూడా ఐదు రాష్ట్రాల పోలింగ్ ప్రక్రియ డిసెంబర్ 5–9 తేదీల మధ్య ముగిసే అవకాశాలు ఉన్నాయని.. ఇందుకు అనుగుణంగా అక్టోబర్ రెండో వారంలోనే షెడ్యూల్ రావొచ్చని అధికార వర్గాలు చెప్తున్నాయి.

# మరికొందరు కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ?

సాక్షి, హైదరాబాద్: ఇంటర్, డిగ్రీ కాలేజీల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న మరికొంత మంది అధ్యాపకులను క్రమబద్ధీకరించే అవకాశాలున్నాయి. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు ప్రభుత్వానికి పంపించనున్నారు. మే, జూన్ నెలల్లో ఇంటర్, పాలిటెక్నిక్ కళాశాల విద్యాబోధనలో ఉన్న 3,897 కాంట్రాక్ట్ ఉద్యోగులను ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. ఇప్పుడు వారంతా రెగ్యులర్ ఉద్యోగులైపోయారు. అయితే సరైన అర్హతలు లేనికారణంగా కొంతమందిని క్రమబద్ధీకరించలేదు. కొంతమంది డిస్టెన్స్‌లో డిగ్రీ చదివినవాళ్లు, రాష్ట్రంలోని బయటి రాష్ట్రాల స్టడీ సెంటర్లలో చదివినవారూ ఉన్నారు. వీరేకాకుండా కొన్ని పోస్టుల మంజూరు లేకుండా లెక్చరర్లను నియమించారు. మరికొన్ని చోట్ల మంజూరైన పోస్టు సబ్జెక్టు ఒకటయితే.. మరో సబ్జెక్టు బోధించే అధ్యాపకులు పని చేస్తున్నారు. డిగ్రీ కాలేజీ అధ్యాపకులకు నెట్, సెట్, పీహెచ్‌డీ తప్పనిసరి కాగా, ఈ అర్హతలు లేనివారిని నియమించారు. అయితే తాజాగా ఈ అర్హతలను సాధించడంతో వీరందరి వివరాలను ఆయా శాఖల అధికారులు ప్రభుత్వానికి సమర్పించారు. ప్రభుత్వం ఆమోదిస్తే, వీరిని సైతం క్రమబద్ధీకరించే అవకాశాలున్నట్లుగా విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి.

## జిల్లా వార్తలు

### రామయ్య సన్నిధిలో కేంద్ర మంత్రి



మంత్రికి జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి, సహకార, సహాయ కేంద్ర మంత్రి బీఎల్ వర్మ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పండితులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా, ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నారు. బీజేపీ నాయకులు కోనేరు చిన్ని, కుంజా సత్యవతి పాల్గొన్నారు.

**ఖమ్మంలో పూజలు**

ఖమ్మం మామిళ్లగూడెం: మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి బీ.ఎల్.వర్మ ఖమ్మంలోని శ్రీఅభయ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి పూజలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు అల్లిక అంజయ్య, దావా కిరణ్, కుమిలి శ్రీనివాస్, తిరుపతయ్య పాల్గొన్నారు.

### ప్రభుత్వ విప్ రేగాకు తప్పిన ప్రమాదం

కాన్వాయ్‌కు అడ్డుగా ట్రాక్టర్ రావడంతో ఢీకొన్న వాహనాలు



ప్రభుత్వ విప్ కాన్వాయ్‌లో దెబ్బతిన్న వాహనాలు

బూర్గంపాడు: ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఆయన సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం బయలుదేరారు. బూర్గంపాడు మండలం ముసలిమడుగు మీదుగా వెళ్తున్న ఆయన కాన్వాయ్‌కు ట్రాక్టర్ అడ్డురావటంతో పైలెట్ వెహికిల్ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో కాన్వాయ్‌లోని వాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. ఈ ఘటనలో విప్ ప్రయాణిస్తున్న వాహనం కూడా ముందు వాహనాన్ని ఢీకొన్నా డ్రైవర్ల సమయస్ఫూర్తితో ఎవరికి ఏమీ కాలేదు.

# ‘సీతారామ’ నీళ్లు ఇవ్వాలి



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎన్డీ శ్రేణులు

- బయ్యారంలో ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి
- ఎన్డీ నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

బయ్యారం: మహబూబాబాద్ జిల్లా బయ్యారం పెద్దచెరువుకు సీతారామ ప్రాజెక్టు నీరు ఇవ్వాలని కోరుతూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యాన సోమవారం ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలను ముట్టడించారు. కార్యాలయాలు తెరుచుకున్నప్పటి నుంచి రెండు గంటల పాటు గేట్లు మూసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎన్డీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య మాట్లాడుతూ బయ్యారం పెద్దచెరువుకు సీతారామ ప్రాజెక్టు నీటిని తీసుకొచ్చి రిజర్వాయర్‌గా చేస్తామని సీఎం కేసీఆర్ రోళ్లపాడులో శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారన్నారు. ఇప్పుడు చెరువుకు గోదావరి జలాలు రాకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఫలితంగా పెద్దచెరువుపై ఆధారపడిన బయ్యారం, గార్ల మండలాలకు చెందిన వేలాది మంది రైతు కుటుంబాలకు అన్యాయం జరుగుతున్నా స్థానిక బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు నోరు విప్పకపోవడం సరికాదన్నారు. కాకతీయుల కాలంలో నిర్మించిన చెరువు అభివృద్ధిని పాలకులు విస్మరించారని మండిపడ్డారు. ఇప్పటికైనా బయ్యారం పెద్దచెరువుకు సీతారామ నీటిని తీసుకొచ్చి మండలంలోని ఏజెన్సీ గ్రామాల రైతులకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. అంతేకాక చెరువు కాల్వలకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలన్నారు. కాగా, కార్యాలయాలను ముట్టడించిన ఎన్డీ నాయకులను ఎస్‌ఐ రమాదేవి అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు మురళీకృష్ణ, భిక్షం, పద్మ, పొమ్మయ్య, వీరభద్రం, మధు, నర్సింహ, నాగేశ్వరరావు, సమ్మయ్య, కొమురయ్య, లింగన్న, రాంబాబు, కోటమ్మ, అరుణ, మంగీలాల్, ప్రభాకర్, లింగమల్లు, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం

- రేపు ఆలయాల అలంకరణ, ప్రత్యేక పూజలు
- దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా ఏసీ సులోచన



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ సులోచన, పక్కన ఉద్యోగులు, అర్చకులు

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించే ఆధ్యాత్మిక దినోత్సవాన్ని విజయవంతం చేసేలా అందరూ కృషి చేయాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎ.సులోచన సూచించారు. ఖమ్మంలోని శ్రీగుంటుమల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని అన్ని దేవాలయాల్లో ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహించాలని తెలిపారు. ఆలయాలను మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించడమే కాక సంప్రదాయాలకు అనుగుణంగా పూజలు నిర్వహించాలని కోరారు. అలాగే, భక్తులు ఆలయాలకు వచ్చేలా చూడాలని తెలిపారు. ఆలయాల్లో భక్తికి సబంధించిన సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించాలని చెప్పారు.

**గుంటు మల్లన్న ఆలయంలో హరితోత్సవం**

ఖమ్మం త్రీటౌన్ ట్రంక్ రోడ్డులోని శ్రీగుంటుమల్లేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం హరితోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎ.సులోచన మొక్క నాటారు. కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ పర్యవేక్షకురాలు రెంటాల సమత, ఈఓల సంఘం ప్రతినిధి కొత్తూరి జగన్మోహన్‌రావు, అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు దాములూరి వీరభద్రరావు, దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తోటకూర వెంకటేశ్వర్లు, దాములూరి కృష్ణశర్మ, ఆనంద్, కె.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు

అశ్వాపురం: మినీ ఇండియాగా పిలుచుకునే అశ్వాపురంలోని భారజల కర్మాగారం అధికారులు, ఉద్యోగుల నివాస సముదాయమైన గౌతమీనగర్‌కాలనీలో మంగళవారం నుంచి జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఒడిశాలో జరిగే పూరీ జగన్నాథుడి రథయాత్రకు అనుసంధానంగా ఏటా ఇక్కడ కూడా రథయాత్ర, ఉత్సవాలు నిర్వహిస్తారు. హెవీ వాటర్ ప్లాంట్‌లో విధులు నిర్వర్తించే ఒడిశా రాష్ట్రానికి చెందిన అధికారులు, ఉద్యోగుల ఆధ్వర్యాన ఏర్పడిన ఉత్కల్ పతాగర్ సమితి ఆధ్వర్యాన ఈ నెల 28 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. తొలిరోజైన మంగళవారం ఉదయం ఉత్కల్ పతాగర్ మండపం నుంచి జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవి విగ్రహాలను గుండిచాఘర్ మందిరానికి తీసుకొచ్చి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు చేయనుండగా, ఈనెల 28న బాహుడా యాత్రతో ఉత్సవాలు ముగుస్తాయి. కాగా, తొలిరోజు పూజలో జీఎం కేవీ థాలే పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

# గిరిజన విద్యాసంస్థల్లో ఉన్నత విద్య





ర్యాంకులు సాధించిన విద్యార్థులతో పీఓ గౌతమ్ పాట్రు, అధికారులు

**జేఈఈ ర్యాంకర్లను అభినందించిన ఐటీడీఏ పీఓ**

భద్రాచలం: గిరిజన గురుకులాల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించడమే కాక ఉన్నత విద్య అందిస్తున్నామని భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు తెలిపారు. ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో గిరిజన విద్యార్థులు పలువురు ర్యాంకులు సాధించగా పీఓ సోమవారం వారిని అభినందించి మాట్లాడారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో భద్రాచలం గిరిజన గురుకులానికి చెందిన కోర్స లక్ష్మి 1,326 ర్యాంకు, రఘునాథపాలెం ఎస్‌ఓఈ విద్యార్థి బి.ప్రవీణ్ ఎస్టీ విభాగం నుంచి 63, జె.బాలాజీ 380, డి.శివాజీ 438 ర్యాంకు సాధించగా, 1,500 లోపు ర్యాంకులను మరో 12 మంది విద్యార్థులు పొందారని తెలిపారు. ఇంకా దమ్మపేట, కిన్నెరసాని గురుకులం విద్యార్థులు క్వాలిఫై అయ్యారని పేర్కొన్నారు. వారితో పాటు ఇంటర్‌లో అత్యధిక ర్యాంకులు సాధించిన విద్యార్థులను కూడా పీఓ సన్మానించారు. ఈ విజయంలో కీలకమైన ఉపాధ్యాయులు, సిబ్బంది, సహకరించిన తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ (జనరల్), డేవిడ్‌రాజ్, ప్రిన్సిపాళ్లు ఎం.బాలస్వామి, ఎం.దేవదాసు, ఎస్.రవికుమార్, జానూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రవేశాల కోసం రావొద్దు**

గురుకుల పాఠశాలల్లో దరఖాస్తులను ఐటీడీఏ కార్యాలయంలో సమర్పించొద్దని ఐటీడీఏ ఏపీఓ జనరల్, గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ, ఇన్‌చార్జ్ డీడీ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన పాల్గొని గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. సంక్షేమ పథకాల కోసం మాత్రం దరఖాస్తులు సమర్పించాలని, అర్హులందరికీ అందేలా చూస్తామని తెలిపారు. గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో సీట్లను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తామని చెప్పారు. ఎస్‌ఓ సురేశ్‌బాబు, అధికారులు భాస్కరన్, మునీర్‌పాషా, ఆర్.శ్రీనివాస్, ప్రభాకర్‌రావు, ఆదినారాయణ, నరేందర్, ప్రమీలబాయి పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యాన్ని విడనాడాలి

**టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి**



కూసుమంచి : మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి

కూసుమంచి: విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి విడనాడాలని తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి డిమాండ్ చేశారు. కూసుమంచిలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు సంబంధించి అనేక బిల్లులు పెండింగ్‌లో ఉండగా, మెడికల్ బిల్లుల మంజూరుకు సైతం ఆరు నెలలకు సమయం పడుతోందని తెలిపారు. వీటితో పాటు ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు దేవేందర్‌తో పాటు మల్లయ్య, భాస్కర్, రాంకోటి, నర్సింహారావు, భద్రూ తదితరులు పాల్గొన్నారు.

**ఎన్నేళ్లు పడుతుంది?**

భద్రాచలంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ, ఇప్పుడు తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యాదినోత్సవాన్ని నిర్వహించడం గర్హనీయమని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి విమర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ కమిటీ సమావేశం సోమవారం జూమ్ యాప్ ద్వారా జరగగా ఆయన మాట్లాడారు. టీఆర్‌టీ ద్వారా ఖాళీ పోస్టులు భర్తీ చేయకుండా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తుండడంతో ప్రాథమిక విద్యా వ్యవస్థ బలహీనపడుతుందని తెలిపారు. మన ఊరు – మన బడి పథకం ద్వారా ఏటా వెయ్యి పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్న ప్రభుత్వం అన్ని పాఠశాల్లో పనులు పూర్తిచేయడానికి ఎన్నేళ్లు పడుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బి.రాజు, హరిలాల్, రామాచారి, శ్రీనివాస్, రాంబాబు, రమేష్, గంగరాజు, ఉమాదేవి, బాలు, కృష్ణబాబు, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.